# పెరిగిన సంసారం

ప్రొద్దున్నే వచ్చి వెళ్ళాడు నందయ్య.

"స్వామీ, అమ్మాయి కొద్దిగా అంగా ఉంగా అంటోంది. ఫరవాలేదు. మీ దయవల్ల త్వరగా మాటలు వస్తాయని నమ్మకం కలుగుతోంది" అన్నాడు ఆనంద బాష్పాలు రాలుస్తూ.

"శుభం" అన్నాడు శేఖరం. తర్వాత తనలో తానే నవ్వుకొన్నాడు. తను చేసిందేమిటి- నందయ్య వచ్చి తనగోడు వెళ్ళబోసుకున్నప్పుడల్లా ఓపిగ్గా విని, ఓదార్పుమాటలు చెప్పడం కన్నా! అయినా నందయ్యకేదో భ్రాంతి-తనలో ఏదో గొప్ప శక్తి ఉన్నదనీ, తన అనుగ్రహం ఉంటేచాలు, అన్నీ సవ్యం గానే నెరవేరుతాయని! ఆ భ్రాంతి పోగొట్టాలని ప్రయత్నిం చినా లాభంలేదు. నందయ్యనమ్మకం చెదరదు.

ఒక్క నందయ్యేగాదు, ఈఊళ్ళో అందరికీ తనమీద అలాంటి నమ్మకమే! ఉదయం లేచింది మొదలు రాత్రివరకు విధి విరామంలేకుండా ఎందరో వస్తూపోతుంటారు. ఒక్కొక్క రికీ ఒక్కొక్కరకమైన బాధలు, సమస్యలూ! అవి చెప్పు కుంటూఉంటే వాళ్ళకేదో సంతృప్తిగావుంటుంది. సహజమైన సౌజన్యంచేత తను ప్రశాంతంగా అందరిమాటలూ వింటాడు. తనకు తెలుసు- తాను వారిబాధలను ఏవిధంగాను తొలగించ లేడని.

తానే ఒకప్పుడు అధీరుడై సమస్తమూ కోల్పోయి దిక్కుతోచక, చీకట్లోతడుముకునే ప్రాణిలా ఈఊరు వచ్చాడు.

ఈ ఊరువాళ్ళని ఉద్ధరిద్దామన్న సదుద్దేశంతో కాదు, ఏకాంతంగా ప్రశాంతంగా కొన్నాళ్ళు జీవితాన్ని గడిపి, తన్ను గురించి తాను ఆలోచించుకోవాలనీ, ఈ జీవితానికి అంతరార్థం ఏమిటో తెలుసుకోవాలనీ. అంచేతే అందరికీ దూరంగా ఈ పల్లెటూళ్ళో ఈ చిన్న కుటీరాన్ని ఏర్పరచుకుని ఉన్నాడు. అది అంతకుముందు ఆ ఊరి పిల్లలకు పాఠశాలగా ఉపయోగపడేది. చుట్టూ అందమైన పూలమొక్కలు, మధ్యన ఒక్కటే హాలులా ఇల్లు. చాలా అందంగా ఉన్నది. అది తనకు దొరకడం నిజంగా అదృష్టం. ఇప్పుడు వేరే పెద్దభవనం కట్టుకోడంచేత బడిపిల్లలు అందరూ అక్కడికి వెళ్ళిపోయారు. ఇది తనకోసం ఖాళీగా మిగిలింది.

ఈ ఊరువచ్చి అప్పుడే ఆ రేండ్లయింది. ఇక్కడ తన మనస్సుకు ఊరటకలిగింది. వచ్చినప్పుడు ఎంతో దుఃఖంలో మునిగిపోయి, జీవితమంటేనే విసుగూ, విరక్తితో, భయంతో వచ్చాడు. అప్పటిస్థితి వేరు! ఇప్పటిస్థితి వేరు! అప్పుడు గుండెల్లో దహించుకుపొయ్యే జ్వాల ప్రపంచాన్నంతా శుష్కంగా శూన్యంగా చేసింది. ఇన్నాళ్ళకు ఆ మంటలు చల్లారి ఆ అగ్నిగుండమే నిర్మలంగా వెలుగుచూపే దీపకళిక అయింది. ఇప్పుడు తన ఆలోచనలూ బాధలూ, అన్నీ ఇతరులను గురించే! తనను గురించి కాదు.

తాను ధనవంతులఇంట పుట్టాడు. తనకు ఎప్పుడూ ఏ లోటూ లేదు. కోరికలన్నీ ఎప్పుడూ మొలకెత్తడమే ఆలస్యంగా

నెరవేరేవి. ఒక్కడే కొడుకు గావడంతో అల్లారుముద్దుగా పెంచిన అమ్మా నాన్నా తనమాట కెన్నడూ ఎదురుచెప్పలేదు. అయితే ఈ గారాబం తనని పెడతోవన మాత్రం పెట్టలేదు. అమితాసక్తితో చదువుకోవడం, అందరియందు దయా, గౌరవము ఇవి తనకు సహజగుణాలే అయాయి.

చిన్నప్పుడే తనకు శాంతతో పరిచయమైంది. ఆమె సంపన్నుల ఇంటనే పుట్టింది. ఆమె తండ్రికీ తన తండ్రికీ ఎంతో స్నేహం! అంచేతే ఆమెను వివాహం చేసుకోవాలనుకున్న తన కోరిక అన్నికోరికలలాగే ఎటువంటి ఆటంకమూ లేకుండా ఫలించింది.

శాంత సన్నగా, పొడుగ్గా, నాజూకుగా లేత తమలపాకులా ఉండేది! ఆమె నవ్వినప్పుడల్లా ఆమె బుగ్గలు అనూయకంగా సొట్టలు పడేవి. కళ్ళల్లో ఎప్పుడూ అంతులేని దయా ప్రశాంతి వెల్లి వెరిసేవి. ఆమెను భార్యగా పొందడం తన అదృష్టం అనుకున్నాడు. పెళ్ళయిన తరువాత ఆమెతో గడపిన ఒక్క ఏడాది స్వర్గసౌఖ్యం అనుభవిస్తున్నట్లు భావించాడు. ఆమెను విడచి ఎప్పుడూ ఒక్క క్షణమైనా ఉండలేదు. అప్పట్లో తనకు తెలియదు— ఈ లోకంలో కష్టాలూ, తీరని కోరికలూ ఉండవచ్చనీ, సుఖానికి అంతం ఉంటుందనీ!

ఆఏడు వేసవిలో తానూ, శాంతా చల్లని కొండప్రదేశాలకు వెళ్ళారు. అప్పటికి ఆమె గర్భవతి. పుట్టబోయే పాప రూపురేఖలు ఊహించుకోటంలోనే తమకు గంటలు గడచి

పొయ్యేవి. ఒకరోజు తాము ఒక పెద్ద జలపాతం చూడటానికి వెళ్ళారు. అది ఒకకొండపై ఎత్తునించి బ్రహ్మాండంగా గంభీరంగా కిందకు పడుతోంది. దగ్గరగా నించుని భయంకరమైన ఆ నీటి ధ్వనీ, ఎంత దూరమో చిందిపడుతున్న తుంపరలూ చూస్తూ ఉంటే ఏదో మనస్సుకు భయంగా బెంగగా ఉంటుంది. పక్కనే గుట్టలమీదనించిఉన్న సన్నని త్రోవ వెంబడి చూడటానికివచ్చిన జనం చాలామంది ఆజలపాతం పైభాగానికి నడచివెళ్ళి అక్కడి నించి దాన్ని చూస్తున్నారు. శాంతా, తనూకూడా నెమ్మదిగా నడచి అక్కడకి వెళ్ళారు. ఆ జలపాతానికి కొంచెం దూరంగా ఒక చిన్న గట్టుమీద కూర్చుని అది ఎంతో ఉరవడితో ప్రవహించి కిందకుదుముకుతూ ఉంటే సంతోషంతో చూస్తూ కూర్చున్నారు.

"ఎంత ప్రశాంతంగా హాయిగావుంది ఇక్కడ!" అన్నాడు తను. శాంత చిన్నగా నవ్వింది. తను ప్రేమతో ఆమె భుజంమీద చేయివేసి దగ్గరకు లాక్కొని కౌగలించుకున్నాడు. శాంత ముఖం సిగ్గుతో ఎఱ్ఱబడింది.

"ఛీ, ఊరుకోండి! అందరూ మనల్నే చూస్తున్నారు" అన్నది మందలింపుగా.

"చూస్తే నాకేం" అన్నాడు తను ధీమాగా.

"మీకేమీ లేదులెండి, కాని నాకున్నదిగా" అన్నది మెల్లగా నవ్వుతూ.

"ఉంటే ఏంచేస్తావు! నా దగ్గరనుంచి తప్పించుకు పారిపో

లేవుగా?" అన్నాడు తను చిలిపిగా, పంతంకొద్దీ ఆమెను మరింత దగ్గరగా లాక్కుంటూ.

"ఎందుకు పారిపోలేనూ? చూస్తూఉండండి వెళ్తానో లేదో!" అన్నది, ఆమె కూడా పంతంగా నవ్వుతూ.

ఉన్నట్టుండి తనపట్టు విడిపించుకుని వెనకకు రెండడుగులు వేసింది. తనూ పట్టుదలతో ఒక్కడుగు ముందుకుదుమికి నవ్వుతూ ఆమెను పట్టుకోబోయాడు. ఆమెకూడా ఉత్సాహంగా చిలిపిగా నవ్వుతూ ఇంకా రెండడుగులు వెనక్కువేసింది- అంతే - కాలుజారింది. ఆమె కెవ్వున కేక వేసింది. ఆ కేక తనగుండెల్లోకి దూసుకుపోయింది. తనకళ్లు చీకట్లుకమ్మాయి. ఆమె ఎక్కడుందో, ఏమైందో తనకు కనిపించలేదు. గుడ్డిగా కంగారుగా 'శాంతా!' అని అరుస్తూ తనూ ఆ అగాధంలోకి దూకబోతుంటే తన్ను వెనకనుండి యెవరో గట్టిగా పట్టుకున్నారు. అంతే తెలుసు. జనంఅంతా గందరగోళంగా అరుస్తున్నారు. తనకు స్పృహతప్పింది.

తనకు మళ్ళా తెలివివచ్చేటప్పటికి అమ్మా నాన్నా వచ్చారు. తన్ను ఊరికి తీసుకువెళ్ళారు. నవ్వుతూ నవ్వుతూ ఒక్కనిమిషంలో అగాధంలోకి అస్తమించిన శాంతతోపాటు తనజీవితమూ ముగిసింది. మనస్సుకు ఏదో దిగ్భ్రమకలిగింది. అది చాలారోజులవరకు వదలలేదు. ఎటువంటిసూచనా లేకుండా క్షణములో ముగిసిపొయ్యే ఈ సుఖమూ, ఈ జీవితమూ- వీటి

ప్రయోజనమేమిటి? నిరర్థకమైన ఈ మనుగడలోని అంతరార్థ
మేమిటి?- అనిపించింది.

నవ్వుతూ నవ్వుతూ ఆనందాన్ని అందిచ్చే శాంతా,
ఆకారం వహించకుండానే ఆశలు కల్పించి మాయమైన తన
పాపా- అంతా ఒకక్షణంలో నవ్వులాటలో ఇసుకమీద బొమ్మ
విలాసంగా తుడిపివేసినట్లు చెరిగిపోయింది. ఏవిధంగానూ తన
ఆరాటం తగ్గేట్లు కనిపించలేదు. ప్రయత్నం చెయ్యాలి. ఒంట
రిగా కొన్నాళ్ళు గడపాలి. అన్నిబంధాలూ వదల్చుకోవాలి,
శాంతిమార్గమేదో తనకుతానే తెలుసుకోవాలి అనిపించింది.
ఆఉద్దేశంతోనే ఒక్కడూ ఈఊరువచ్చి ఉంటున్నాడు. ఎన్నడూ
దేనికీ అభ్యంతరంపెట్టని అమ్మా నాన్నా ఇప్పుడూ అడ్డుచెప్ప
లేదు. ఎక్కడో ఒకచోట మళ్ళా ప్రశాంతంగా కులాసాగా
ఉంటే చాలనుకున్నారు.

ఈ ఊరువచ్చిన కొత్తలో ఒక పొరపాటు చేశాడు.
అప్పుడు మనస్సు విరక్తితో ఉన్నదికాబట్టి దాని కనుగుణంగా
కావిబట్టలే కట్టుకోవాలనుకున్నాడు! మనఃప్రవృత్తికీ బాహ్య
వేషానికీ ఏమీ సంబంధంలేదు. మనస్థితిని బాహ్యచిహ్నాల
ద్వారా వ్యక్తం చెయ్యనక్కరలేదు. అది అప్పుడు తెలియ
లేదు. అందరూ తనవేషమూ ఒంటరితనమూ చూచి తన్నేదో
గొప్ప యోగిగా వూహించుకున్నారు. ఇప్పుడు మళ్ళీ తాను
వేషంమార్చుకున్నా, వాళ్ళందరితో కలసిమెలసి తిరుగుతున్నా,
అభిప్రాయం మాత్రం మారలేదు.

అప్పటిలాగే ఇప్పుడూ తనదగ్గరికి వస్తూనేఉన్నారు. తమగోడు చెప్పుకుంటూనేవున్నారు. క్రమంగా వాళ్ళ సంసారాల బాధ్యతలన్నీ తనవే అయాయి. తనకి తోచినసలహాలు చెపుతూనే ఉన్నాడు. వాళ్ళతోపాటు తనూ వాటినిగురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. జీవితమంటే భయపడి పారిపోయి వచ్చిన తనను ఇందరి జీవితాలు పెనవేసుకున్నవి. తన కర్తవ్యమేదో తెలుసుకోలేని తనకు, ఇందరికి మార్గం చూపించాల్సిన బాధ్యత కలిగింది. తలచుకుంటే తనకు నవ్వు వస్తుంది.

పోలమ్మకి ఒక్కడేకొడుకు. వాడు చెప్పినమాట వినడు. నానాఅగచాట్లుపడి డబ్బుపంపి బస్తీలో చదివిస్తుంటె, ఆ డబ్బు సినీమాలకి, సిగరెట్లకి తగలేస్తాడు. ఎన్నిసార్లయినా పరీక్షలు తప్పుతాడు. ఎప్పటికైనా బాగుపడేనా? ఏమో ! అదీ పోలమ్మ గోడవ. ఇప్పుడు తనకూ అదే ఆలోచన. ఆ పిల్లవాడిని ఎన్నిసార్లో పిలిచి కేకలేశాడు.

నందయ్య ఆ ఊర్లో అందరిలోకి డబ్బుకలవాడు. లేక లేక పుట్టింది ఒక్కత్తే ఆడపిల్ల ! దురదృష్టం ! ఆ పిల్లకు ఎన్నాళ్ళయినా మాటలు రాలేదు. అదీ నందయ్య బాధ. బంగారం బొమ్మలావున్న ఆపిల్లని చూస్తే తనకూ ఎంతో బాధగా ఉంటుంది. అమాయకంగా ఆ అమ్మాయిచేసే మూగసంజ్ఞలు చూస్తే గుండె తరుక్కుపోతుంది. ఈపిల్లకు మాటలువస్తే ఎంత బాగుండును అనిపిస్తుంది !

పాపం లక్ష్మయ్యకు ఎన్నికలపిచ్చి! ప్రతిసారీ తప్పక నిలబడతాడు. పిచ్చివాడు, ఈ గొడవలోపడి ఆస్తిఅంతా తెగనమ్ముకుంటున్నాడు. ఈసారైనా గెలుస్తాడా? ఏమో!

గౌరయ్యకి పాపం పేకాటసరదా! పనీపాటా ఏమీ చూసుకోడు. వాడిభార్య చాలా మంచిది, అమాయకురాలు. "బాబూ, వాడికి ఈ పిచ్చిపోదా? మీరేదైనా ఉపదేశించ కూడదా" అంటుంది. తను ఎప్పుడు బుద్ధులు చెప్పినా గౌరయ్య ఆనిమిషం అతివినయంగా "చిత్తం చిత్తం" అంటాడు. మర్నాడు మళ్ళా మామూలే!

చంద్రిక భర్తకి ఏదో మొండివ్యాధి. మనిషి పాలిపో తున్నాడు. "ఈ వ్యాధి తగ్గదా, మీరేమీ మందివ్వలేరా" అంటుంది అది, దిగులు దిగులుగా!

నరసయ్య కూతుర్ని అత్తవారు ఎన్నాళ్ళయినా తీసుకు పోరు. ఎప్పుడో ఇస్తామన్న పొలం ఇప్పుడే రాసివ్వమంటారు. నరసయ్యకు దిక్కుతోచదు. పిల్ల కృంగి కృశించి పోతోంది.

వీరయ్య కొడుకులు నలుగురూ పట్నంలో చదువు తున్నారు. అందరూ ప్రతిఏడూ మొదటి తరగతిలోనే పాసవు తున్నారు. వీరయ్య అందరినీ చదివించలేడు. ఎవరిని మానిపించా లన్నది ఏయేటి కాయేడు సమస్య.

తెల్లవారిలేస్తే ఇన్నిరకాల వ్యక్తులు, ఇన్నిరకాల సమ స్యలతో తనదగ్గరకు వస్తారు. రానురాను అవన్నీ తనసమస్యలు గానే తోస్తున్నాయి. సంసారం వదలివచ్చిన తనను ఇన్ని

సంసారాలు చుట్టుకున్నాయి. అన్నిబంధాలూ తెంచుకోవాలను
కున్న తనకు ఇన్ని అనుబంధాలు యేర్పడ్డాయి తమాషాగా.
ఇప్పుడు ఈ ఊరినుంచి వెళ్ళిపోదామంటే కూడా అయ్యో
పాపం! వీళ్ళందరినీ యెలావదలడం అనిపిస్తుంది. తన సంసారం
యెంతగా పెరిగింది! ఒక్క పువ్వునూ, ఒక్కముల్లునూవదలి,
ఇన్నిపూలనూ, ఇన్నిముళ్ళనూ ముడివేసుకున్నాడు. ఇప్పుడు
ఇదే తనకు ప్రశాంతి.